క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ పనులు జరిగే ప్రాంతాలైన మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యంచెల్క ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్

నకిరేకల్ : బీఆర్ఎస్ నకిరేకల్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి కొంత కాలంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు తెలిపారు. బుధవారం నకిరేకల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గుర్రం గణేశ్, నాయకులు పల్లె విజయ్, దైద పరమేషం, సామ శ్రీనివాస్‌రెడ్డి, యానాల లింగారెడ్డి, బీమనబోయిన లింగరాజు, బెజవాడ రామకృష్ణ, కొండ వినయ్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని యాదవ సంఘం భవనంలో అధర్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికాస తరంగిణి వైద్యులు, సేవాభారతి సహకారంతో గురువారం మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రణీత

నార్కట్‌పల్లి: రాష్ట్ర ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘం (ఎల్టి) ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి ప్రభుత్వ పాఠశాలల ఒలింపియాడ్ ఉపన్యాస పోటీలను నల్లగొండ డైట్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న డి.ప్రణీత మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ప్రణీతకు బుధవారం అమ్మనబోలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి, ఆకవరం శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ ప్రకాశ్, బాల భాస్కర్, కావేరి, అనురాధ, పారిజాత, లక్ష్మమ్మ, లక్ష్మారెడ్డి, రాములమ్మ, లింగయ్య, విజయ్, శారద పాల్గొన్నారు.

బేటీ బచావో- బేటీ పడావో



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ యశోద

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ముమ్మడి యశోద పాల్గొని బాల్య వివాహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు, ఏఎన్‌ఎం సరిత, అంగన్‌వాడీ టీచర్ మరియమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నార్కట్‌పల్లి : స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన కూరగాయల అంగడి స్థలంపై విచారణ చేయించాలని కోరుతూ నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం నార్కట్‌పల్లి గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మెడబోయిన శ్రీనివాస్, కన్నెబోయిన నర్సింహ, నోముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్ సర్వీస్ ప్రారంభం



బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్

నకిరేకల్ : నకిరేకల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్‌ను బుధవారం సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్ ప్రారంభించారు. ఈ బస్ ప్రతిరోజు ఉదయం 9 గంటలకు తుంగతుర్తి వయా అర్వపల్లి వంగమర్తి, నకిరేకల్ మీదుగా దిల్‌సుఖ్‌నగర్‌కు చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బయలుదేరి నకిరేకల్‌కు 3 గంటలకు చేరుకుంటుందన్నారు. నకిరేకల్ నుంచి వంగమర్తి, అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల మీదుగా సూర్యాపేటకు చేరుకుంటుందని వివరించారు. బస్ సర్వీసును నకిరేకల్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సైదులు, ఆర్టీసీ సిబ్బంది మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం జరిగేనా!

- సొంతిల్లు ఉన్నా ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు !
- సర్వే చేసిన అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు ఆరోపణలు
- వార్డు సభల్లో ఆందోళన చేస్తున్న ప్రజలు



జాబితాలో పేర్లను చూసుకుంటున్న దరఖాస్తుదారులు

నల్లగొండ టూటౌన్ : సొంతిల్లు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా రూ. 5లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని ప్రజాపాలన కార్యక్రమంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. నీలగిరి పట్టణంలో ప్రతి వార్డులో కౌంటర్లు పెట్టి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఇదే దరఖాస్తులో గృహజ్యోతి, మహాలక్ష్మి, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల కోసం వివరాలు పొందుపర్చారు. దాంతో పట్టణంలోని పలు వార్డులకు చెందిన వారు ఈ దరఖాస్తులో ఇందిరమ్మ ఇళ్ల కోసం టిక్ చేశారు. ఆయా కాలనీల్లో సొంతిల్లు ఉన్న వారు కొందరు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం కొందరు ఇందిరమ్మ ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకోవడం విస్మయం కలిగిస్తోంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికే ఈ పథకాలు వస్తాయని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయా కాలనీల్లో ప్రజాపాలన కింద దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందుతుంది. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాపాలన కింద దరఖాస్తులు చేసుకోవడానికి అనర్హులు. కానీ కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నట్లు ఇక్కడ స్పష్టమవుతోంది. కాగా వీరందరికి ఇప్పటికే సొంతిల్లు ఉన్నా కూడా 'ఇందిరమ్మ ఇల్లు' కావాలంట అని కాలనీల్లోని స్థానికులు పెదవి విరిస్తున్నారు.

15 శాతం వరకు అనర్హులే..

నీలగిరి పట్టణంలోని అన్ని వార్డుల్లో కలిపి 26 వేల పైగానే ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు అందాయి. ప్రతి వార్డుల్లో ఐదారుగురు ప్రభుత్వ ఉద్యోగులు, 100 మంది వరకు సొంత ఇల్లు ఉన్న వారు సైతం ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. దాదాపు 10 నుంచి 15 శాతం వరకు అనర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ సిబ్బంది ఆయా వార్డుల్లో తిరిగి దరఖాస్తుదారు ఫొటో తీసుకున్నారు. దరఖాస్తుదారులు తమకు సొంత ఇల్లు లేదని, అద్దె ఇల్లు అని చెబుతూ మున్సిపల్ సిబ్బందికి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అసలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు రావాలంటే చుట్టు పక్కల వారిని సైతం అడిగితేనే ఎవరు అద్దెకు ఉంటున్నారు.. ఎవరు సొంతింటి దారులు అనే విషయం బయటికి రానుంది. లేకుంటే గతంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల మాదిరిగా అనర్హులు సైతం ఇందిరమ్మ ఇల్లు తన్నుకుపోయే ప్రమాదం ఉందనే చెప్పాలి. కాగా మంగళవారం నుంచి నిర్వహిస్తున్న వార్డు సభల్లో పలువురు దరఖాస్తుదారులు ఆందోళనలు చేస్తున్నారు. తమకు అర్హతలు ఉన్నా లబ్ధిదారులు జాబితాలో తమ పేరు ఎందుకు లేదని వార్డు ఆఫీసర్లను ప్రశ్నిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం జాబితాలో పేర్లు లేనివారు వార్డు సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. దరఖాస్తుదారుల వివరాలను సమగ్రంగా తెలుసుకున్న తరువాతనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మున్సిపల్ కమిషనర్ వివరణ ఇచ్చారు.

తుది జాబితాలు పూర్తి కాలేదు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



చిట్యాల : వార్డు సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల: జిల్లాలో సంక్షేమ పథకాలకు అర్హుల తుది జాబితాలు ఇంకా పూర్తి కాలేదని ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. చిట్యాల మున్సిపాలిటీలోని ఐదో వార్డులో బుధవారం జరిగిన వార్డు సభలో ఆమె నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభల్లో అధికారులు సంక్షేమ పథకాలకు వచ్చిన దరఖాస్తులను ప్రజలకు వివరిస్తున్నారని, ఆ జాబితా.. తుది జాబితా కాదని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారితోపాటు ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభల్లో చేస్తున్న దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని వివరించారు.

స్థలం ఎక్కడ ఉన్నా ఇల్లు మంజూరు..

మున్సిపాలిటీలతోపాటు, గ్రామాలకు చెందిన వారు వృత్తి, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉన్నప్పటికీ ఆధార్‌కార్డు అడ్రస్‌తో సంబంధం లేకుండా స్వగ్రామంలో ఇంటి స్థలం ఉన్నట్లయితే ఇందిరమ్మ ఇల్లు పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీల్లో అద్దె ఇళ్లల్లో ఉన్న వారిని సైతం ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎంపిక చేస్తామన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, 700 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఉన్నాయని వీటితో పాటుగా మంత్రుల సహకారంతో ఇంకో 2500 ఇళ్లను మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మున్సిపల్ కమిషనర్ వీరేందర్, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు జడల పూలమ్మ చినమల్లయ్య, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, పాటి మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మాజీ సర్పంచ్ జిట్ట నగేష్, గుండెబోయిన సైదులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు కాలేదు

నార్కట్‌పల్లి : కొత్త రేషన్ కార్డులు ఇంకా మంజూరు కాలేదని, అది కేవలం అర్హత కలిగిన వారి జాబితా మాత్రమే అని, అందులో అనర్హులు ఉంటే తొలగిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజలకు వివరించారు. బుధవారం నార్కట్‌పల్లి, దాసరిగూడెం, మాధవ ఎడవల్లి, మాండ్ర, చిన్ననారాయణపురం, బెండల్‌పహాడ్, బాజకుంట, కొండపాకగూడెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. నార్కట్‌పల్లి గ్రామ సభలో ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి కలెక్టర్ పాల్గొని ప్రజల అనుమానాలను నివృత్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఉమేష్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి

తిప్పర్తి : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తిప్పర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. తిప్పర్తి మండలంలోని కాశివారిగూడం గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి బుధవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సొంత భవనాలు నిర్మిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సుధీర్, నాయకులు వెంకటరాంరెడ్డి, షేక్ హుస్సేన్, జాకటి మోష, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, షేక్ అబ్దుల్‌రహీం, పల్లె ఎల్లయ్య, బత్తిని మట్టయ్య, కిన్నెర అంజి, షేక్ అలీ, లతీఫ్‌పాష, షేక్ ఇస్మాయిల్, షేక్ బషీర్, పల్లపు వెంకన్న, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మర్రిగూడ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం మాజీ అధ్యక్షుడు కళా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా కళా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా జి.నరసింహా, మండల అధ్యక్షుడిగా గ్యార వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ధనావత్ బాలాజీ, ఉపాధ్యక్షులుగా వీహెచ్.రాజు, జి.లక్ష్మీ, కోశాధికారిగా పెరుమాళ్ల ఉపేందర్‌లు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు ఎంఈఓ బిట్టు శ్రీనును కలవగా వారిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో బాలరాజు, వెంకట్, విఠల్, బాలాజీ, నాగయ్య, నాగేంద్రమ్మ, మంజుల, అశోక్, సుధారాణి, యాదయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహ నాయక్

తిప్పర్తి : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తిప్పర్తి ఎంఈఓ నర్సింహనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సదానందం, జ్యోతి, పద్మలత, సుభాషిని, జ్యోతిర్మయి, శ్రీదేవి పాల్గొన్నారు.


సాంకేతిక విద్యపై అవగాహన పెంచుకోవాలి

మునుగోడు: ప్రతి విద్యార్థి సాంకేతిక విద్యపై అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ కత్తుల రవీందర్ అన్నారు. విద్యార్థులల్లో సాంకేతిక విద్య పెంపొందించేందుకు చేపట్టిన కలాం స్ఫూర్తి యాత్ర బుధవారం మునుగోడు జిల్లా పరిషత్ పాఠశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యంపై పోటీ పరీక్షలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, హెచ్.ఎం అంజయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సంబరాలు

నల్లగొండ టౌన్: సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్లు పెంచాలని ఆందోళన చేసిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం హమాలీ రేట్లు పెంచుతూ జీఓ విడుదల చేసిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి తెలిపారు. జీఓ విడుదలైన సందర్భంగా నల్లగొండలో బుధవారం సివిల్ సప్లై హమాలీ కార్మికులు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. సివిల్ సప్లై ఈఎం కార్యాలయంలో డీఎంకు, సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్ రెడ్డి, దొనకొండ వెంకన్న, విశ్వనాథుల లెనిన్, బుచ్చయ్య, గిరి, జానీ, రాంబాబు, శివ, రామస్వామి సైదులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ




దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ నిర్వాహకులు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని దుప్పలపల్లి రోడ్‌లో ఫాదర్ పెజ్జోని స్థాపించిన లెప్రసీ హెల్త్ సెంటర్‌లో ఇన్ పేషెంట్స్‌కు, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు బుధవారం ఖమ్మం జిల్లాకు చెందిన గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, వంట సామగ్రి, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు బిషప్ జాకబ్, లెప్రసీ హెల్త్ సెంటర్ డైరెక్టర్ సిస్టర్ అంబికా, సిస్టర్ ఆరోగ్యమేరి, డాక్టర్ మనోజ్‌వర్మ, పసల శౌరయ్య, జాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

నల్లగొండ: విద్యుత్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్‌ను తక్షణమే కన్వర్షన్ చేయాలని కోరుతూ బుధవారం నల్లగొండ సర్కిల్ విద్యుత్ కార్యాలయం వద్ద ఆర్టిజన్స్ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 3వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ఆర్టిజన్‌లను జూనియర్ లైన్‌మెన్లుగా ప్రభుత్వం గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సలీంపాష, పెరిక శేఖర్, శ్రీపతి రమేష్, జిట్టబోయిన లింగస్వామి, దాసరి యాదయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న ఆర్టిజన్స్

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



నకిరేకల్ : కడపర్తిలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్లగొండ టూటౌన్ : దరఖాస్తు స్వీకరిస్తున్న కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

నకిరేకల్ : సంక్షేమ పథకాలను పేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశ అన్నారు. నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలోని బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల ప్రతిపాదిత జాబితాలో పేరు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ జమురుద్దీన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ మేకల నాగయ్య, నాయకులు పాటి యాదగిరిరెడ్డి, దుబ్బాక యాదగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ పట్టణంలో..

నకిరేకల్ పట్టణంలోని 1, 3, 4, 5, 6, 7వ వార్డుల్లో బుధవారం ప్రజా పాలన వార్డు సభలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ బాలయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని పిట్టంపల్లి, ఆరెగూడెం, తాళ్ళవెల్లెంల, బోయగుబ్బ, వట్టిమర్తి గ్రామాల్లో బుధవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. వట్టిమర్తి గ్రామంలో జరిగిన సభలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఆరెగూడెం, పిట్టంపల్లి, తాళ్ళవెల్లెంల గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి భూములున్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారని అధికారులకు గ్రామస్తులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ జయలక్ష్మీ, ఎంపీఓ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేతేపల్లి: నకిరేకల్ నియోజకవర్గంలో మొదటి విడతలోనే 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. బుధవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్, కొప్పోలు, కొండకిందిగూడెం, కాసనగోడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కొర్లపహాడ్‌లో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.ఆయా కార్యక్రమాల్లో డీసీఎంస్ చైర్మన్ బోళ్ళ వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ గుత్త మంజుల మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, మాజీ సర్పంచులు ఎడ్ల పార్వతమ్మ, కుమ్మరి నాగయ్య, మండల ప్రత్యేక అధికారి జె.హరీష్, తహసీల్దారు ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి, ఏఓ బి.పురుషోత్తం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్ : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. నీలగిరి పట్టణంలోని 13వ వార్డు నుంచి 24వ వార్డు వరకు బుధవారం వార్డు సభలు నిర్వహించారు. ఆయా వార్డు సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కౌన్సిలర్లు ఏర్పుల తర్షణ, మాతంగి సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ): ప్రజాపాలన గ్రామసభలు రెండో రోజు నల్లగొండ మండలంలో కొనసాగాయి. మేళ్లదుప్పలపల్లి, బుద్దారం, వెలుగుపల్లి, రాములబండ, ఖాజీరామారం, అప్పాజీపేట, గుండ్లపల్లి, పాతూరు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఏఓ శ్రీనివాస్, ఏపీఎం వినోద తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి : తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం, రామలింగాలగూడెం, జంగారెడ్డిగూడెం, గోదోరిగూడెం, సిలార్‌మియాగూడెం, అంతయ్యగూడెం గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి , తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఓ సన్నిరాజు, ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రేణుక, అరవింద్‌రెడ్డి, సుమలత, మాజీ సర్పంచ్ యర్రమాద నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని మునుకుంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభ గందరగోళంగా మారింది. సంక్షేమ పథకాలకు తమకు అర్హత ఉన్నప్పటికీ ఎందుకు గుర్తించడం లేదని అధికారులను నిలదీశారు. అర్హులు మరలా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు సర్వే చేసి లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారని ఎంఈఓ అంబటి అంజయ్య తెలపడంతో ప్రజలు శాంతించారు. అదేవిధంగా మండలంలోని రామచంద్రాపురం, ఈదులూరు, పందెనపల్లి, ఎరసానిగూడెం, బొల్లేపల్లి గ్రామాల్లో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గిరిప్రసాద్, సుకన్య, చలపతి పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని రేగట్టె గ్రామంలో బుధవారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి పద్మ, ఆర్ఐ సునీత, జీపీ కార్యదర్శి సుంకిరెడ్డి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

చండూరు (గట్టుప్పల్) : చండూరు, గట్టుప్పల్ మండలాల్లో బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామ సభలు రసాభాసాగా మారాయి. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి, అంతంపేట గ్రామాల్లో దరఖాస్తుదారులు అధికారులను నిలదీశారు. ప్రతిపాదిత జాబితా చదవనీయకుండా ప్రజలు అడ్డుపడడంతో పోలీసులు కల్పించుకుని సర్దిచెప్పారు.ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ రాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండలంలోని రాజ్యానాయక్‌తండా, మేళ్లవాయి, నేవిళ్ళగూడెం, టీపీ గౌరారం, పసునూర్, మహ్మదాపురం, చిట్టంపహాడ్, రాందాస్‌తండాల్లోబుధవారం గ్రామ సభలు నిర్వహించారు. పసునూర్ గ్రామ సభలో చండూర్ ఆర్డీఓ శ్రీదేవి పాల్గొన్నారు. 8 గ్రామాల్లో 1306 మంది నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. తహసీల్దార్ దేవసింగ్, ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి, ఆర్ఐ దయాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, ఝాన్సీ, ఏఈఓ అనూష, సాయి, భాస్కర్ పాల్గొన్నారు.

మునుగోడు: బొల్లేడు, కల్వకుంట్ల, బొల్లేడు, చీకటిమామిడి, సింగారం, పులిపులపుల గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ శాంతకుమారి, తహసీల్దార్ ఎం.నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణిదీప్ పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం, వట్టిపల్లి, తమ్మడపల్లి, దామెరబీమనపల్లి, అంతంపేట గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, మునుగోడు ఏడీఏ వేణుగోపాల్, ఎంపీడీఓ జి.చిన మునయ్య, డీటీ జూటూరు తారకరామన్, ఏఓ హేమలత, ఎంపీఓ బిట్టు శ్రీనివాస్, ఎంపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నాంపల్లి : పసునూర్‌లో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీదేవి



కట్టంగూర్ : మునుకుంట్ల గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు



రామగిరి(నల్లగొండ): మేళ్లదుప్పలపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ శ్రీనివాస్

వృద్ధుడికి ఎమ్మెల్యే భరోసా

నకిరేకల్ : మండలంలోని కడపర్తి గ్రామంలో బుధవారం ప్రజా పాలన గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం తన ఔదార్యాన్ని చూపారు. గ్రామానికి చెందిన 57 ఏళ్ల వృద్ధుడు బాత్క సత్తయ్య తనకు వృద్ధాప్య పింఛన్ రావడం లేదని, ఏడేళ్లుగా నరాల వ్యాధితో బాధపడుతున్నానని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వేముల వీరేశం.. ప్రభుత్వం నుంచి పింఛన్ వచ్చే వరకు ప్రతి నెలా తానే సొంతంగా పింఛన్ డబ్బులు ఇస్తానని సత్తయ్యకు భరోసా ఇచ్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నకిరేకల్ : టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందినేని వెంకటేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, పోతుల వెంకటనారాయణ, మురళి, పల్స రామలింగయ్య, వెంకన్న, సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



ఎమ్మెల్యే వీరేశంను సత్కరిస్తున్న డాక్టర్లు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీనివాస నర్సింగ్ హోంలో రాపోలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మలక్‌పేట్ యశోద ఆస్పత్రి వారి సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యం అందించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో దాదారు 460 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశంను ఫౌండేషన్ డాక్టర్లు రాపోలు రఘునందన్, మంజుల సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మర్రిగూడ : మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో మేటిచందాపురం గ్రామపంచాయతీకి చెందిన లపంగి మహేందర్‌కు మంజూరైన రూ.36వేలు, ఊరిపక్క శంకర్‌కు మంజూరైన రూ.26వేల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం మాజీ ఎంపీటీసీ ఊరిపక్క సరితానగేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అయితగోని అశోక్, లపంగి భిక్షం, ఏరుకొండ లింగస్వామి, అయితగోని యాదగిరి, శ్రీను, హుస్సేన్, మౌలాలి, యాదయ్య, నరసింహ, సాయికుమార్, పగిళ్ల శ్రీను, నాగరాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికో డప్పుతో రావాలి

చండూరు : హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7వ తేదీన జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుల సాంస్కృతి కళా మహా ప్రదర్శనకు మాదిగలు ఇంటికో డప్పుతో కదిలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం పిలుపునిచ్చారు. బుధవారం చండూరులో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి నల్లగంటి రమేష్, మండల అధ్యక్షుడు ఆకరపు ఏసు, చండూరు పట్టణ అధ్యక్షుడు ఇరిగి చరణ్, శంకర్, శ్రవణ్, సురేష్, గిరి, లింగయ్య పాల్గొన్నారు.

ఉప్పలంచ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు

కాలిగౌరారం: మండలంలోని ఉప్పలంచ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు బండారు మల్లయ్య(53)ను పాతకక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన ప్రత్యర్థులు మంగళవారం ఉదయం దాడిచేసి తీవ్రంగా గాయపరచగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మల్లయ్య మరణవార్తతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో ఏక్షణాన ఏం జరుగుతుందోనని భయాందోళన నెలకొంది. మంగళవారం జరిగిన ఘటన నేపథ్యంలో రెండు రోజులుగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి మల్లయ్య మృతి చెందడంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశానుసారం గ్రామానికి మరిన్ని పోలీసు బలగాలు చేరుకున్నాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి గ్రామంలో జనం గుంపులుగా ఏర్పడకుండా పోలీసులు వారిని ఇళ్లలోకి వె వెళ్లగొట్టారు. గురువారం గ్రామానికి మల్లయ్య మృతదేహం రానుండడం, పలు ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, మల్లయ్య సానుభూతిపరులు గ్రామానికి అధిక సంఖ్యలో తరలిరానుండడంతో గ్రామాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. ఎక్కడ చూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా మల్లయ్య మరణ వార్త తెలిసిన మరుక్షణమే ప్రత్యర్థి కుటుంబాలు, వారి సానుభూతిపరులు, కాంగ్రెస్ మినహా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు గ్రామాన్ని విడిచి వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.